# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రైతుల ధాన్యం కొనుగోళ్లల్లో ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌లో మార్కాపురం, పోలవరంను కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేస్తూ.. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**

3. **వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఈ రోజు దర్శించుకున్నారు.**

4. **ఆంధ్రప్రదేశ్ లో కల్తీ మద్యం నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.**

5. **రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్ గా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోదని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ లోని అన్ని దేవాలయాలు తిరుమల శ్రీవారి సేవకుల తరహా విధానాన్ని అవలంభించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దేవదాయ శాఖ అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖలపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, వ్యవసాయం, వైద్యారోగ్యం, రవాణా, దేవదాయ శాఖ సహా పలు శాఖల పనితీరుపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..“రాష్ట్రంలో ఉన్న అన్ని దేవాలయాల్లో స్థానికంగా వాలంటీర్లను నియమించుకోవాలన్నారు. దేవాలయాల్లో సేవలు చేసే వారిని గుర్తించి, వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో క్షేత్ర స్థాయి పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లల్లో ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రవాణా శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ఆటోమేటెడ్ డ్రైవింగ్ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మార్కాపురం, పోలవరంలను కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేస్తూ.. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రి వర్గం నిన్న సమావేశమైంది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు నాదెండ్ల మనోహర్,

సత్యకుమార్ యాదవ్‌లతో కలసి రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాత్రికేయులకు వెల్లడించారు. అన్నమయ్య జిల్లాను కొనసాగిస్తూనే.. జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మార్చే ప్రతిపాదనకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందన్నారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలతోపాటు పలుచోట్ల మార్పులు, చేర్పులపై ఈ నెల 31న తుది నోటిఫికేషన్ జారీ కానుందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు ఈ రోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ప్రతి ఏటా ధనుర్మాసం శుక్ల పక్షంలో వచ్చే ఏకాదశినే వైకుంఠ ఏకాదశిగా జరుపుకుంటారు. వైకుంఠ ఏకాదశిని ముక్కోటి ఏకాదశిగా కూడా పిలుస్తారు. వైష్ణవాలయాలలో ఈ రోజు ఉత్తరద్వారం లో శ్రీమన్నారాయణుని దర్శించుకుంటే పుణ్యం లభిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి.వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాలలోని వైష్ణవాలయాలలో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి.వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

---------------------------

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఈ రోజు దర్శించుకున్నారు. తిరుమలలో వైకుంఠద్వార దర్శనాలు ఈ తెల్లవారుజామున 1.30 నిమిషాల నుంచి ప్రారంభమవ్వగా ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయానికి వచ్చిన ఆయనకు టీటీడీ ఛైర్మన్ బీఆర్‌నాయుడు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి స్వాగతం పలికారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో కల్తీ మద్యం నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. రాష్ట్రంలో మద్యం నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై నిన్న ఆయన మాట్లాడుతూ, పారదర్శకంగా మద్యం విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఇందు కోసం ఎక్సైజ్ సురక్ష యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 20 సెకన్లు

---------------------------

2025 లో కేంద్ర ప్రభుత్వ పరివర్తనాత్మక విధానాలు, భారతీయ క్రీడాకారుల ప్రతిభ ఏకమై చారిత్రాత్మక విజయాల పరంపరను అందించిన సంవత్సరంగా నిలిచింది

ఈ ఏడాది కాలంలో క్రీడా రంగంలో భారతదేశం సాధించిన పురోగతి గురించి ఆకాశవాణి అందిస్తున్న కథనం..

క్రీడా రంగంపై నిబద్ధతను ప్రతిబింబిస్తూ, నరేంద్ర మోడీ ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి క్రీడా శాఖకు రికార్డు స్థాయిలో 3వేల794 కోట్ల నిధులను కేటాయించింది. రెండు దశాబ్దాల నాటి జాతీయ క్రీడా విధానం 2001 స్థానంలో జాతీయ క్రీడా విధానం (ఎన్ఎస్‌పి) 2025ను జూలైలో కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది.ఈ సంస్కరణలకు తోడుగా, జూలైలో ప్రారంభించిన ఖేలో భారత్ నీతి 2025, భారతదేశ క్రీడా

రంగంలో ఒక నూతన మార్పును తీసుకువచ్చింది.నవంబర్ లో, భారత మహిళల క్రికెట్ జట్టు ఐసిసి మహిళల ప్రపంచ కప్‌ను కైవసం చేసుకోగా, భారత మహిళల అంధుల క్రికెట్ జట్టు తమ మొట్టమొదటి టి20 ప్రపంచ కప్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. ఇలా ఈ సంవత్సరం భారతదేశ క్రీడా విప్లవంలో తిరుగులేని ఏడాదిగా రుజువు చేసింది.

--------------------------

రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్ గా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోదని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించిన 28వ ఇంటర్ "పాలిటెక్నిక్ ప్రాంతీయ క్రీడా సమావేశాన్ని స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ తో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువులతో క్రీడలకు ప్రాధ్యానమివ్వాలన్నారు. వారిలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు స్పోర్ట్స్ మీట్ వంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ 30 సెకన్లు

--------------------------

తెలంగాణలో సహకార సంఘాల బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లో నాబార్డు ఆధ్వర్యంలో జరిగిన "అంతర్జాతీయ సహకార వారోత్సవాల సదస్సు"లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సహకార సంఘాలను కంప్యూటరీకరించి ఆధార్ ఆధారిత చెల్లింపులు, బీమా సాయం వంటి డిజిటల్ సేవలు అందిస్తున్నామని చెప్పారు. 2024-25లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు 7వేల 500 కోట్ల రుణాలను మంజూరు చేశామని, 311 సంఘాలను రైతు ఉత్పత్తి సంఘాలుగా మారుస్తున్నామని మంత్రి వివరించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో చలి తీవ్రత కొనసాగుతోంది. అన్ని జిల్లాల్లోనూ చలి గాలులు వీస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్లోని మన్యం ప్రాంతంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నిన్న అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులో 4.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే తెలంగాణాలోని కొమరంభీం అసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణిలో అత్యల్పంగా 6.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. దట్టమైన పొగమంచు కారణంగా ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది.

=====================